క్లుప్తంగా

కృష్ణా కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



కృష్ణా కాలువలో నాచు, తూడును తొలిగిస్తున్న కూలీలు

ఏలూరు రూరల్ : ప్రభుత్వం కృష్ణా కెనాల్ నుంచి నీటి విడుదల చేస్తుండడంతో సాగునీరు పారుదలపై అధికారులు దృష్టి పెట్టారు. కృష్ణా కాలువలో ఏలూరు శివారు గ్రీన్‌సిటీ నుంచి తూర్పులాకుల వరకు పేరుకుపోయిన గుర్రపు డెక్క, నాచు, పాదల తొలిగింపు పనులు శనివారం చేపట్టారు. హనుమాన్‌నగర్ పరిసరాల్లో పంటకాలువకు అడ్డుగా ఉన్న పూడిక తొలిగించడంతో కాలువలో నీరు కిందకు పారుతోంది. గ్రీన్‌సిటీ వంతెన వద్ద నుంచి ఉదయం 6 గంటలకు కూలీలు ప్రారంభించిన పనులు పాతబ స్టాండ్ వద్ద వరకు కొనసాగాయి. ఈ పనుల నిర్వహణపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాదేపల్లి, శ్రీపర్రు, జాలిపూడి, కాట్లంపూడి తదితర పంచాయతీ అధికారులు తాగునీటి చెరువుల్లో నీరు నింపేందుకు సిద్ధమౌతున్నారు.

4న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకుల సమావేశం

ఏలూరు (టూటౌన్): బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతోత్సవాల సందర్భంగా కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 4న సాయంత్రం 4 గంటలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకుల సమావేశం స్థానిక కోటదిబ్బ నందలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్ తెలిపారు. స్థానిక నవాబ్‌పేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నాయకులంతా పాల్గొనాలని కోరారు. పల్లెం ప్రసాద్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఇట్రంచి గణేష్, నేతల రమేష్ బాబు, మేతర అజయ్ బాబు, పొలిమేర హరికృష్ణ, తోటకూర కిషోర్, భూపతి అప్పారావు, బంగారు రజని, కె.సంజీవ్ రావు, పాము రవీంద్ర, కర్రే అంబేడ్కర్ తదితురులు పాల్గొన్నారు.

నేడు మాదేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్: మాదేపల్లి పంచాయతీ గురుకులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొని ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తారు.

క్రీడాకారిణులకు అభినందనలు



క్రీడాకారిణులను అభినందించిన అధికారులు

ఏలూరు రూరల్: క్రీడలతో మహిళలు మరింత ఆత్మవిశ్వాసం సాధించవచ్చని అర్జున్ అవార్డ్ గ్రహీత, కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్, గోల్డ్ మెడలిస్ట్ నీలంశెట్టి లక్ష్మి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడల్లో రాణిస్తోన్న మహిళలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శనివారం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సాధనతో విజయం సాధ్యమౌతుందన్నారు. అపజయాలను అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అగ్రికల్చర్ జేడీ రామకృష్ణ మాట్లాడుతూ క్రీడా విజేతలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతారని కొనియాడారు. రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బడేటి వెంకట్రామయ్య, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు, పసుపులేటి ప్రసాద్ క్రీడలు ప్రాముఖ్యత, క్రీడాకారిణిల నైపుణ్యాన్ని కొనియాడారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో చోరీలకు చెక్

- జిల్లాలో 36,097 యాప్ రిజిస్ట్రేషన్లు
- 851 మందికి సేవలు



సత్రంపాడులో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ (ఫైల్)



ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న మురళీకృష్ణ (ఫైల్)

ఏలూరు టౌన్: వేసవి సెలవులు సమీపిస్తుంటే దొంగల బెడద పెరిగిపోతుంది. సెలవుల్లో విహార యాత్రలు, శుభకార్యాలు, బంధువుల ఇళ్లకు సరదాగా వెళ్లే సమయంలో దొంగలు ఇళ్లను గుల్లచేస్తుంటారు. తీరా ఊరి నుంచి తిరిగి వచ్చాక విలువైన బంగారం, నగదు, ఇతర వస్తువులు చోరీకి గురికావడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తుంటారు. కాని లాక్డ్ హౌస్ మానటిరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) దొంగలకు చెక్ పెడుతుంది. ఈ విధానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఊరు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో రిజిష్టర్ అయితే పోలీసులు మన ఇంటిని సీసీ కెమెరాలో పర్యవేక్షిస్తుంటారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ఎవరైనా ఇంటి తలుపు తడితే చాలు వెంటనే పోలీసు ప్రధాన కేంద్రానికి సమాచారం వెళుతుంది. క్షణాల్లోనే పోలీసులు అప్రమత్తమై దొంగలభరతం పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల మధ్యాహ్న సమయంలో సత్రంపాడు సెంటర్‌లోని వైద్యుడు లోకి కృష్ణ నివాసం ఉండే అపార్ట్‌మెంట్ ప్లాట్ తాళం పగలగొట్టి దుండగులు నగదు, బంగారు నగలు అపహరించుకుపోయారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాది కాలంలో చోరీ కేసులను ఛేదించి భారీగా విలువైన బంగారు వస్తువులను సీసీఎస్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ రికవరీ చేశారు. సుమారుగా 30 నుంచి 40 చోరీ కేసులను ఛేదించడం తోపాటు సుమారు రూ.3 కోట్ల విలువైన వస్తువులను రికవరీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నుంచి ప్రశంసా పత్రం నగదు బహుమతిని సీసీఎస్ సీఐ మురళీకృష్ణ అందుకున్నారు.

సేవలు ఇలా:

- పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళ్లే సమయంలో ఇళ్లలో దొంగలు చోరీలు చేయకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.
- గూగల్ ప్లే స్టోర్‌లో ఏపీఎల్‌హెచ్‌ఎంఎస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ● మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ నెంబరు ఆధారంగా పూర్తి సమాచారం నమోదవుతుంది. ● ఊరు వెళ్లే సమయంలో యాప్‌లో వాచ్ రిక్వెస్ట్‌ను క్లిక్ చేసి సమాచారాన్ని పూర్తి చేయాలి. ● ఊరువెళ్లే తేదీ, సమయం, తిరిగి ఇంటికి వచ్చే తేదీ, సమయం నమోదు చేయాలి.
- యాప్‌లో సమాచారాన్ని నమోదు చేసి సబ్మిట్ చేయగానే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళ్తుంది. ● యాప్‌కు సంబంధించి సీసీ కెమెరాను ఇంటివద్ద పోలీసులు ఏర్పాటు చేస్తారు. ● మోషన్ డిటెక్షన్ కెమెరా కావడంతో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సీసీ కెమెరా ముందు కురాగానే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళ్తుంది. ● సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తారు.

36,097 రిజిస్ట్రేషన్లు :

ఏలూరు జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నవారు సుమారుగా 36,097 మంది ఉన్నారు. వీరిలో వాచ్ రిక్వెస్ట్‌ను కోరిన వారు 851 మంది ఉండగా వీరందరికీ ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను అందించారు. ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఐదేళ్ల క్రితం ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంతో అంతరాష్ట్ర దొంగ పోలీసులకు పట్టుపట్టాడు. ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన అవసరం



చోరీలను నివారించేందుకు ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కలిగి ఉండాలి. ఏదైనా దూరప్రాంతాలకు ఇల్లు వదిలి వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి. వేసవి కాలం రావడంతో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగపడుతుంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సుమారుగా 30కి పైగా చోరీలను ఛేదించి బాధితులకు విలువైన వస్తువులు రికవరీ చేశారు. ప్రజల సహకారంతో దొంగతనాల అదుపు సాధ్యమవుతుంది.

– సీహెచ్ మురళీకృష్ణ, సీసీఎస్ సీఐ, ఏలూరు

సాగునీటిపై రైతులకు భరోసా



మల్కాపురంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ రామకృష్ణ

ఏలూరు రూరల్ : మల్కాపురం రైతులకు పుష్కలంగా సాగునీరు అందిస్తామని వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ భరోసా ఇచ్చారు. శనివారం ఆయన ఏలూరు మండలం మల్కాపురంలో నీటి ఎద్దడికి గురైన వరిచేలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఉపసర్పంచ్ తూతా నిరంజన్, వెంకటేశ్వరరావు తదితర రైతులు మాట్లాడుతూ దెందులూరు వద్ద కార్పొరేషన్ అధికారులు మోటార్లు ఉపయోగించి రిజర్వాయర్‌కు నీటిని తోడడం వల్ల గోదావరి నీరు కిందకు పారడం లేదని తెలిపారు. కృష్ణా కెనాల్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన రామకృష్ణ ఇరిగేషన్ ఎస్సీ, నగర కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి మోటార్లు నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం కృష్ణా కెనాల్ నుంచి నీటిని విడుదల చేసిందని రైతులకు చెప్పారు. ఆదివారం మధ్యాహ్నానికి నీరు చేరుతుందన్నారు. జేడీ వెంట ఏడీ వై సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారిణి ఎ.జీవనసంధ్య, సహాయకులు బి.వినోద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక



విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏలూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏలూరులో ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా జాన్ మోషే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.ఇశ్రాయేల్, కార్యదర్శిగా టి.సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీహెచ్ బసవయ్య, ఆఫీస్ సెక్రటరీగా అశోక్ కుమార్, కోశాధికారిగా ఐ.రాజకుమార్, కమ్యూనిటీ సెక్రటరీగా నంబూరి శ్రీనువాసులు, ఉపాధ్యక్షులుగా ఉదయకుమార్, ఎ.సుధాకర్, సువర్ణరాజు, కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సెక్రటరీలుగా సీహెచ్ చంద్రశేఖర్, కల్యాణ చక్రవర్తి, యర్రా పాల్, నాగరాజు, పబ్లిసిటీ సెక్రటరీగా శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు సీహెచ్ సాయిబాబు, పి.సాల్మన్‌రాజు, జీపీవీ పాల్, ఎస్ వెంకట్రావు, పి.రాజ్‌కుమార్, ఎం.ఝాన్సీ, టి.శశిధర్ పాల్గొన్నారు. సభాధ్యక్షుడిగా కేఎస్‌సీహెచ్‌వీ రాజు వ్యవహరించారు. నూతనంగా కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు అభినందించారు.

చలో ఢిల్లీకి తరలివెల్లిన కార్మికులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 5న ఢిల్లీలో నిర్వహించే కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీలో పాల్గొనేందుకు ఏలూరు నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, కా ర్యకర్తలు శనివారం తెల్లవారు జామున తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. సోమయ్య, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసా ద్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాసంపదనంతా పెట్టుబడిదా రులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారని విమర్శించారు.

ప్రత్యేక శిక్షణకు ఎంపీడీఓ ప్రణవి

ఏలూరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు ఎంపీడీఓ బి.ప్రణవి ఉద్యోగ శిక్షణకు వెళ్లారు. శుక్రవారం ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. బాపట్ల, సామర్లకోటలోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో ఆరు నెలల పాటు శిక్షణ పొందనున్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత తిరిగి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ లేదా ఈఓపీఆర్డీని జెడ్పీ సీఈఓ నియమించనున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



ఎమ్మెల్యే నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ రాము

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సూచించారు. ఏలూరు జిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు చేపట్టిన అరవపల్లి రాము శనివారం సాయంత్రం ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని, కూలీలకు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జలసిరి పథకం బోర్ల ద్వారా సాగు చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో బోర్లు ద్వారా వ్యవసాయం చేస్తోన్న రైతాంగానికి ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీ ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. రైతులకు సంపూర్ణ సహకారాన్ని అందించి మెరుగైన సేవలకు కృషి చేయాలని తెలిపారు.

ఏసు మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



పవిత్ర దివ్య బలిపూజ సమర్పిస్తున్న ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏసు ప్రభువు చూపిన మార్గం సమాజంలో ప్రతి వ్యక్తికీ ఆదర్శమని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. బిషప్ జయరావు యాజక అభిషేక వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రగతి నగర్‌లోని అడోరేషన్ మోనస్ట్రీ ఆలయంలో దివ్య బలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా జయరావు సందేశమిస్తూ గురుత్వ జీవితపు పవిత్రతను, ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సోదర భావంతో మసలుకోవాలని, తమ పరిసరాల్లోని పేదలను ఆదుకోవడానికి ఆపన్న హస్తం అందించిన వారు ప్రభువు సన్నిధికి చేరుకుంటారని చెప్పారు. నగరంలోని ఓ కాన్వెంట్‌లో కుట్టు విద్యను అభ్యసిస్తున్న పలువురు బాలికలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. 31వ గురుత్వ వార్షికోత్సవాన్ని ముగించుకుని 32వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన బిషప్ జయరావును పలువురు ఫాదర్లు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు మేత్రాసన కోశాధికారి ఫాదర్ రాజు బేదంపూడి, సోషల్ సరీ్వస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మాని యేలు, కథీడ్రల్ విచారణకర్త ఫాదర్ మైఖేల్ ఇంజమాల, డీపాల్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ తోట అంతోని, ఫాదర్ ఇంజే పౌలు, ఫాదర్ అమ్మన రాజా, ఫాదర్ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సబ్‌స్టేషన్ల ఏర్పాటు పనులు



కొమడవోలు జగనన్నకాలనీలో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్



పోణంగి జగనన్నకాలనీ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటుచేస్తున్న 80 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్

- రూ.4 కోట్లు చొప్పు మంజూరు
- 24 గంటల కరెంట్ సరఫరా

ఏలూరు రూరల్: పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.4 కోట్లు చొప్పున మొత్తం రూ.12 కోట్లు విడుదల చేసింది. అప్పటికే రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించడంతో ట్రాన్స్‌కో అధికారులు శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో నివసించే ప్రజలు విద్యుత్ కష్టాలు ఎదుర్కొన్నారు. వేసవి కాలంలో విద్యుత్ హెచ్చుతగ్గులు, కోతలు ఏర్పడడంతో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకాలనీ ప్రజలు భవిషత్‌లో విద్యుత్ కష్టాలు ఎదుర్కొనకుండా ముందుగానే సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఏలూరు నియోజకవర్గంలోని లక్ష్మీపురం, పోణంగి, కొమడవోలు జగనన్నకాలనీల్లో నివసించే పేదలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు ఒక్కొక్క కాలనీలో సుమారు ఐదు నుంచి 10 సెంట్లు భూమిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుచేస్తోంది. గత ప్రభుత్వంలో 10 నుంచి 15 పంచాయతీలకు అంటే సుమారు 15 వేల జనాభాకు ఒక సబ్‌స్టేషన్ ఉండేది. నేడు ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలో ఆరు నుంచి ఏడు వేల కుటుంబాల కోసం సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తుండడం విశేషం. ఇందులో 80 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నామని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. వీటివల్ల కాలనీలో నివాసితులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

24 గంటలూ సరఫరా

సబ్‌స్టేషన్ ద్వారా జగనన్నకాలనీల్లో నివసించే పేదల ఇళ్లకు అధికారులు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇందుకోసం ప్రతి సబ్‌స్టేషన్‌కు నలుగురు సిబ్బందిని నియమించనున్నారు.

ముఖ్యమంత్రి కృషి అభినందనీయం



గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకున్నాయి. దీనివల్ల పేదల చీకట్లో కష్టాలు పడుతూ జీవన సాగించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని జగనన్నకాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాలనీల్లో నివసించే వారందరూ పేదలే. విద్యుత్ సమస్య లేకపోతే సంతోషంగా ఉండవచ్చు. అందుకే ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మిస్తోంది.

– కంచన రామకృష్ణ, పోణంగి

ఉత్తమ గ్రామాలు మారుతాయి



కాలనీలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేయడం చేస్తోంది. గతంలో ఎన్నడూ ఎవ్వరూ ఇలా అభివృద్ధి చేయలేదు. రానున్న రోజుల్లో ఇక్కడ పేదలు ఉన్నత వర్గాలకు దీటుగా మౌలిక వసతులతో జీవించవచ్చు. ఇప్పటికే రోడ్లు నిర్మించారు. నీటి వసతి కల్పించారు. ముందు ముందు ఇంకా అభివృద్ధి చేస్తారనే నమ్మకం పేదల్లో ఏర్పడింది.

– బత్తిన విజయకుమార్, కార్పొరేటర్, చొదిమెళ్ల

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	13

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

విశాఖ ఉక్కు దీక్షలకు సంఘీభావం



ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 700 రోజులుగా విశాఖ పట్టణంలో నిర్వహిస్తోన్న దీక్షలకు సంఘీభావంగా ఏలూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ, అమిత్‌షాలు దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులైన అదానీ, అంబానీలకు అప్పగించడాన్ని ఖండించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర రాష్ట్ర విభజన హామీలను మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. నాయకులు ఆర్ లింగరాజు, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, కాకర్ల అప్పారావు, మన్నవ కృష్ణ చైతన్య, ఉప్పులూరి హేమ శంకర్, కె.కన్నయ్య, పోలా భాస్కర్, బల్ల కనకదుర్గారావు, మంగం అప్పారావు, ఇల్లా శ్రీను, మంగం పెద్దిరాజు, కె.రాజు, వీవీఎస్ ప్రసాద్, కోటేశ్వరరావు, జి.శ్రీను పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ విద్యుత్ డిప్యూటీ ఈఈగా త్రివాసు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ పరిధిలోని ఏలూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పెదవేగి ఆపరేషన్ డిప్యూటీ ఈఈ ఎస్.త్రివాసును నియమిస్తూ ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఓంకార్‌ను ఇటీవల క్రమశిక్షణ చర్యల్లో భాగంగా నరసాపురం సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. దీంతో ఆ స్థానంలో ఖాళీ ఏర్పడింది. మరో రెండు మూడు రోజుల్లో తాడేపల్లిగూడెం, నిడదవోలు, భీమవరం డివిజన్లలో పలువురు అధికారులకు స్థాన చలనం కలుగనుందని విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

పెదపాడు: అప్పనవీడు మానవత శాఖ పేద విద్యార్థికి రూ.15వేల ఆర్థిసాయం అందించినట్లు ఆశాఖ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. విట్ యూనివర్సిటీలో బీబీఏ 3వ సంవత్సరం చదువుకుంటున్న హనుమాన్ జంక్షన్‌కు చెందిన దండమూడి శ్రీధర్ కుమారుడు హస్వంత్ చౌదరికి శనివారం కళాశాల ఫీజు నిమిత్తం కోటేశ్వరరావు చేతుల మీదుగా సాయం అందించారు.

రామాలయం వద్ద అన్నదానం

పెదపాడు: స్థానిక తెలగాలపేట రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో శ్రీరామనవమి పురస్కరించుకుని శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు.